# ఇసుక అద్దం



డౌన్‌టౌన్ దుబాయ్. బుర్జ్ ఖలీఫా.

'ఎడారి దిబ్బల్లో నిలబడి ఆకాశాన్ని చీల్చుతూ మూతి పైకెత్తిన రాకాసి డైనోసార్ లెక్కనే ఉందిది' అనుకున్నాడు శివ. డ్యూటీ ఎక్కే ప్రతిసారీ అదే మాట అనుకుంటాడు. ప్రతిసారీ భయపడతాడు.

తొమ్మిదొందల అపార్టుమెంట్లున్న అతి ఎత్తైన మానవ నిర్మిత కట్టడం అది. లోపల ఆఫీసులు, మాల్స్, కృత్రిమ సరస్సు, హెలిప్యాడ్స్ మొత్తం ఎంత ఎత్తంటే సూర్యాస్తమయం తర్వాత కూడా సూర్యుణ్ణి దీని పై అంతస్తుల్లో నుండి చాలా నిమిషాల వరకు చూడచ్చు. అందుకే ఎనభయ్యవ అంతస్తుకు పైన నివసించేవారు రంజాన్ ఉపవాసాన్ని విరమించ డానికి అదనంగా రెండు నిమిషాలు వేచి ఉండాలని, నూట యాభైయవ అంతస్తు పైన నివసించేవారు మూడు నిమిషాలు వేచి ఉండాలని దుబాయ్ మత పెద్దలు నిర్ణయించారు.

వంద కిలోమీటర్ల దూరం నుండి కూడా దుబాయ్ స్కైలైన్‌ని ముద్దాడుతున్నట్టు ఈ అద్భుతమైన కట్టడం కనపడుతుందంటే దానికి కారణం దీని ఎత్తు, బాహ్యంగా మెరిసే అద్దాలు. వీటన్నిటినీ తళతళా మెరిపించాలంటే మాటలా? వంద అంతస్తులకు పైన ఉండే వాటిని యంత్రాలు శుభ్రం చేస్తాయి. కింద నుంచి వంద అంతస్తుల వరకూ మనుషులు చేస్తారు. అలాంటి మనుషుల్లో ఒకడు శివ. అతను తన టీమ్‌కి లీడర్ కూడా. మరో గంటలో డ్యూటీ ఎక్కాలి. డ్యూటీ ఎక్కడమంటే రోప్ మీద వేళ్లాడుతూ నడుముకున్న హుక్‌ను నమ్ముకుని బకెట్‌లో ముంచిన వైపర్‌ను అద్దం మీద రుద్దడం. కిందకు చూస్తే పై ప్రాణాలు

పైనే పోతాయి. ఈ పని చేయకుంటే తన ప్రేమ పోతుంది.

శివ మరోసారి బుర్జ్ ఖలీఫా వైపు చూసి చెవి వెనక నుండి మెడ మీదకు కారే సన్నటి చెమట చుక్కను పట్టించుకోకుండా గట్టిగా ఊపిరి పీల్చి ఫోన్ స్క్రీన్ చూసాడు. ఇక్కడకి వచ్చే ముందు రోజు చార్మినార్ బ్యాక్‌గ్రౌండ్లో కౌముదితో తీసుకున్న సెల్ఫీ. అది చూస్తూ ఆమె బుగ్గని బొటను వేలుతో నిమిరాడు. అంతటితో ఆగలేక వాట్సాప్ కాల్ చేసాడు.

'హలో'

'డ్యూటీ ఎక్కేదుందే ఇప్పుడు. మస్త్ టెన్షన్ అయితాంది'

'చల్ తియ్. మస్త్‌సార్లు ఎక్కినవ్, దిగినవ్. నువ్వు మస్త్ డేర్. మంచిగా అయితది'

'నీకేంది? గట్లనే అంటవ్'

'ఏం కాదు పట్టు'

'సర్లే, ఏం కావాల్నే నీకు ఈడ నుండి?' నవ్వుతూ అడిగాడు.

'ఇజ్జత్' అంది ఒక్క సెకను కూడా ఆలోచించకుండా.

వెనక నుండి సూపర్‌వైజర్ కేకకి కాల్ కట్ చేసి లేచి రెడీ అయ్యాడు శివ.

ఎదురుగున్న మహంకాళి అమ్మవారి పటానికి మొక్కిందామె. వాళ్లిద్దరు కలిసింది కూడా ఆ తల్లి దయవల్లే.

❊ ❊ ❊

ఆషాఢం రోజులు. భాగ్యనగరం బోనం ఎత్తింది. వందేళ్లకు పైగా చరిత్రున్న పాతబస్తీ లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన బలిగంప పూజతో జాతర ప్రారంభమైంది. ఎక్కడ చూసినా జనం, ట్రాఫిక్ ఆంక్షలు, రాణిపింక్ చీరలు, పసుపు వర్ణం పట్టు పరికిణీలు, జాలీ దుప్పట్టాలు, తడారని జడల చివర్ల నుండి కారే నీటిబొట్లు, పసుపు, కుంకుమ, బియ్యం పిండి ముగ్గుతో అలంకరించిన మట్టి, రాగి, ఇత్తడి కుండలు, వాటి చుట్టూ అమ్మవారికి ప్రియమైన వేప రెమ్మలు, పోతురాజు విన్యాసాలు, డప్పులు, మైక్‌సెట్లలో అమ్మవారి పాటలు. వాతావరణం హోరాహోరీగా ఉంది. బోనం పైన నిలబెట్టే చిన్న దీపం. ఆ దీపం మోసే మనిషిని, ఆ కుటుంబాన్ని మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ కనిపెట్టుకుంటారని ఆశ.

ఆ ఆశతోనే బోనం మోస్తూ ముందుకు నడుస్తోంది కౌముది తల్లి. తల్లిని అందుకోలేక నాలుగడుగులు వెనకుంది కౌముది. ఇంతలో ఫట్‌ట్‌ట్ అని శబ్దం. అది అందరికి వినిపించిందా లేక శివ ఒక్కడికేనా తెలీదు కానీ చెవులు పగిలిపోయే ఆ గోలలో అతనికి చాలా స్పష్టంగా వినిపడింది. వెంటనే శబ్దం వచ్చిన వైపు చూసాడు. కోపంగా చూస్తోంది కౌముది.

‘బాడ్కావ్. కథల్ పడ్తున్నావ్ ఏందిబే? చల్’

కన్నార్పకుండా చూస్తున్నాడు శివ. పక్కనున్న చిన్నాగాడు ‘అరే, ఏమైంది మామా? ఆగినవేందే?’ అన్నాడు.

‘ఆగురా. అటు సూడు. ఏముందిరా పోరి?’

‘పోరినా? ఏడ మామ?’

‘అదిగో ఆడ సూడు. ఎవడో ఫాల్తుగాడు చెయ్యేస్తే డేర్‌గా వాడి కాన్ కింద ఏక్ బెహారీ భజాయించింది. అట్ల ఉండాలె డేర్గా’

‘అరే మామ! ఈమెనా? ఈమె మన గల్లీలో టీచర్’

‘గింతుంది. ఈమె టీచరా?’

‘ఔమల్ల. మన గల్లీలో పద్మావతి టీచర్ ఉందిలే? ఆమెతోనే పని చేస్తదాడ, అంగన్వాడీలో’

‘నేను పొయ్యి ఓ ముచ్చట చెప్తా’

‘ఏం ముచ్చట?’

‘లవ్ అని చెప్తా’

‘లవ్వా? గిప్పుడే చూసి లవ్వా? నీ ముంగటే ఒకడ్ని భజాయించింది. రేపు పోదాం నడు. ఆమె యాడుండేది నాకు ఎరుకే. ఈడ నుండి పా ఇగ’

❋❋❋

మర్నాడు ఛత్రినాక బస్సుస్టేషన్ దగ్గర చాయ్ తాగి కౌముది ఇంటివైపుకు బయలుదేరారు. చిన్నాగాడు డ్రైవ్ చేస్తుంటే వెనక కూర్చుని ఆమెతో ఎలా మాట్లాడాలా అని ప్లాన్లు వేస్తున్నాడు శివ. తను ఇప్పటి వరకు ఒక అమ్మాయ్‌ని చూసింది లేదు, వెంట పడింది అంతకన్నా లేదు. సహకరించని ఇంటి ఆర్థిక పరిస్థితులు, అక్క పెళ్ళికి చేసిన అప్పుల వల్ల అన్న చదువు మానేసి పనికెళ్తే, అతన్ని ఆదర్శంగా తీస్కుని తొమ్మిది చదువుతుండగా శివ కూడా మానేసాడు. కొన్నాళ్ళు అన్నదమ్ములు కలిసి చిన్న మెకానిక్ షాప్ నడిపారు. తర్వాత వాళ్ళని వీళ్ళని పట్టుకుని ఆయిల్ కంపెనీలో మెకానిక్ ఉద్యోగం సంపాదించి శివ వాళ్ళ అన్న అబుదాబి వెళ్ళిపోయాడు. శివ మాత్రం చిన్నచిన్న బండి రిపేర్లు, పారేయలేక దాచుకున్న మిక్సీలు రిపేర్ చేస్తూ ఇక్కడే ఉండిపోయాడు. తను ఇది, తన పని ఇదని ఎలా చెప్పాలా అనే ఆలోచనలతో టెన్షన్ పడుతున్నాడు శివ.

కుమ్మరి గల్లీ దాటి కాస్త ముందుకెళ్లాక బస్తీ వచ్చింది. నాపరాళ్ళు పరిచిన చిన్న గల్లీ అది. నల్లా దగ్గర రంగురంగుల ప్లాస్టిక్ బిందెలు, చుట్టూ అసహనంగా ఆడాళ్ళు. ఇళ్ళ ముందు కారే డ్రైనేజీ నీళ్లు తప్పించడానికి రాళ్లు వేసున్నాయి. రాయి ఎత్తుపల్లం బట్టి

ముగ్గు. ఒక ముగ్గుకర్ర నేల మీదుంటే మరొకటి రాయిపైన.

కౌముది ఇల్లు బస్తీ మార్కెట్ పక్కన. ఇంటి పక్కన బండి ఆపి లోపలికి వెళ్లారు. బయట చిన్న వసారా. అక్కడక్కడా నూనె మరకలున్నాయ్. బోనాలప్పుడు అప్పలు వండినట్టున్నారు. ఇక్కడే కూర్చుని కౌముది కూడా అప్పలు చేసిందా అన్నట్టు అటే చూస్తున్నాడు శివ. చాటల్లో ఎండుమిర్చి ఎండకేసారు.

'ఎవరు కావాలె?' అంటూ చేతిలో చీపిరి పట్టుకొచ్చిందొకామె.

'టీచరమ్మ కోసం ఒచ్చినం' అన్నాడు చిన్నాగాడు.

'ఇస్కూల్ పొయ్యింది. ఆడికి పొండి. పెండ్లి చేస్కోమంటే ఇనది. ఇస్కూల్ ఇస్కూల్ అని పోతది. ఆడికి పొండి' అని విసురుగా ఊడ్చింది. కాసేపుంటే వీళ్ళని కూడా కలిపి ఊడ్చేటట్టుంది. చిన్నాగాడు శివ చెయ్యి పట్టుకుని బయటకి లాక్కొచ్చాడు.

ఇద్దరూ స్కూల్ దగ్గరకి వెళ్లారు. ఒక పెద్ద స్లాబు కింద రెండు క్లాసు రూములు, ఒక చిన్న స్టాఫ్ రూమ్, మిడ్‌డే మీల్స్ సామగ్రికి ఒక చిన్న స్టోరేజి రూమ్. చుట్టూ ఉన్న పసుపు రంగు గోడ మీద పిల్లల్ని ఆకర్షించేటట్టు రైమ్స్ బుక్కు నుండి బొమ్మలు వేసున్నాయ్.

మొదటి క్లాసులోకి తొంగి చూసాడు శివ. నేల మీద కూర్చుని బోర్డు మీదున్న అక్షరాలు రాస్తున్నారు పిల్లలు. అక్కడే మరోవైపు తిప్పి కూర్చోబెట్టి ఇంకో క్లాస్‌కి పాఠం చెప్తోంది పద్మావతి టీచర్.

'యాడరా పోరి? బోర్డు మీద మోతీ గిట్లజల్లి పోయింది' అన్నాడు శివ ఆ గుండ్రటి అక్షరాలు చూసి.

'ఎవరు కావాలె?' వెనక నుండి పద్మావతి టీచర్.

'టీచరమ్మ లేదా?'

'ఓహ్ కౌముది కొరకా? బస్తీలోకి వెళ్ళింది. బడికి రాని పిల్లల్ని తోల్కొస్తుంది. ఆడ కూర్చోండి' అని క్లాస్‌కి వెళ్ళిపోయింది.

అరగంట తర్వాత నలుగురు పిల్లలతో వచ్చింది కౌముది.

'ఎవరు కావాలె?'

'మీ కొరకే వచ్చిన'

'నా కొరకా? ఏంది?'

'అది... అది'

'ఏంది? జల్దీ చెప్తే నేను క్లాస్‌కి పోతా'

'అది మొన్న బోనాలకాడ చూసిన. అది లవ్'

‘లవ్ ఏంది?’

‘అదే. మీ మీద లవ్ అయ్యింది’

‘దిమాగ్ గిట్ల ఖరాబ్ అయ్యిందా? ఇది స్కూల్. ఇయ్యన్నీ ఈడ నడవవ్. చల్’

ఇద్దరూ బయటకి వచ్చేసారు. శివ మాట లేకుండా బండి ఎక్కాడు.

‘ఎందుకు మామ టెన్షన్? ఇది ఇస్కూల్ అంటే ఇసొంటి మాటలు ఇంకేడైనా మాట్లాడ మనిలే. బేస్తారం సాయిబాబా గుడికొస్తది. ఆడ చెప్పు’ అన్నాడు చిన్నాగాడు ధైర్యం నూరి పోస్తూ.

బేస్తారం సాయిబాబా గుడి దగ్గర వాలిపోయారిద్దరు. దర్శనం అయ్యాక ధుని దగ్గర కౌముదిని పలకరించాడు శివ.

‘మళ్ళీ ఏంది?’

‘అదే. నా లవ్ మ్యాటర్ చెప్పనీకి వచ్చిన’

‘ఏందిరా నాటకాలా? మొన్న బడికాడ, ఇయ్యాల గుడికాడ. చల్’

తర్వాత రేషన్‌షాపు కాడ, మార్కెట్ దగ్గర, చార్మినార్ రద్దీలో ఆమెని ఎన్నిసార్లు కలిసి తన ప్రేమ గురించి చెప్పాలన్నా ఆమె అవకాశం ఇవ్వలేదు. నాలుగు తిట్లు, మూడు వార్నింగ్లతో బ్రేక్ పడింది.

ఒకరోజు చిన్నాగాడు వచ్చి ‘ఐతారం గణేష్ అన్న బిడ్డ లగ్గం. లైట్లు పెట్టనీకి రమ్మండు’ అన్నాడు.

‘గణేష్ అన్న బిడ్డనా? ఇస్కూల్ పిల్లరా. అప్పుడే లగ్గం ఏంది? ఆ పిల్ల పది సదువు తుంది కదరా. అట్లెట్ల లగ్గం చేస్తరు?’

‘ఏహే. మనకెందుకు ఆ పాడు పంచాయితీ? గణేష్ అన్నకి తెల్వదా ఏంది ఆయన బిడ్డ గురించి? లైట్లు పెట్టినామా పైసల్ వసూల్చేసినామా.. గంతవరకే మన పని. పా’

‘మనకెందుకేందిరా? మన ముంగట పెరిగిన పిల్ల. మస్తుసార్లు రాఖీ కూడా కట్టింది. ఆగమాగం అయితదిరా. మా అక్కకి కాలే? గట్లే అయితది’

‘గిప్పుడేంది?’

‘టీచరమ్మకి ఫోన్ చెయ్’

‘ఆమెకెందుకు?‘

‘చెయ్‌రా. ఆమె అంగన్వాడీ టీచర్. ఇలాంటి లగ్గాలు వాళ్ళు అడ్డుకుంటరు. దిమాగ్‌లో కొంచం తెలివిపెట్టి పోతరు.’

అరగంటలో కౌముది, పద్మావతి టీచర్, ఆ ఏరియా ఎస్ఐ, శివ, చిన్నాగాడు అందరూ

గణేష్ అన్న ఇంట్లో ఉన్నారు.

'ఇంత చిన్నపిల్లకి పెండ్లేది? చట్ట ప్రకారం నేరం. జైల్లో పెడ్తరు నిన్ను. మంచిగ చదివే పిల్లని బడి బంద్ చేయించి లగ్గం చేస్తావా?' అని తిట్టింది పద్మావతి టీచర్.

పిల్లని, వాళ్ళ అమ్మని కూర్చోబెట్టి చిన్న వయసులో పెళ్లిళ్ల వల్ల వచ్చే ఇబ్బందులు అన్నీ అర్థం అయ్యేలా చెప్పారు టీచర్లిద్దరు. రెండున్నర గంటల పంచాయితీ తర్వాత లగ్గం ఆగిపోయింది. చేసేదేమిలేక కొరకొరా చూస్తూ లోపలికి వెళ్ళిపోయాడు గణేష్ అన్న.

అయ్యాక పద్మావతి టీచర్ దగ్గరకెళ్ళి థాంక్స్ చెప్పాడు శివ.

'థాంక్స్ ఎందుకు? ఆ బాధ నాకు ఎరుకే' అని ఆమె దిగులుగా వెళ్ళిపోయింది.

* * *

పద్మావతి టీచర్. తెల్లగా, అందంగా ఉంటుంది. అప్పుడే ముప్పైలోకి ప్రవేశిస్తోంది. ఇంటర్లోనే అందరినీ ఎదిరించి మాధవ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అతనికి ఆమె అంటే ప్రాణం. ఇద్దరు కష్టపడి చదువుకున్నారు. ఆమె టీచర్ ఉద్యోగం ఎంచుకుంది, మాధవ్ చిన్నచిన్న కాంట్రాక్టులు చేయడం మొదలుపెట్టాడు. ఏ అండ లేకుండా ఎలా బతుకుతారో చూస్తాం అనిపెద్దలు ఛాలెంజ్ చేస్తే బతకగలమని ఎదురింట్లోనే కాపురం పెట్టారు. కాస్త సెటిల్ అయ్యారు.. డబ్బులు కూడబెట్టుకున్నారు అనుకునే టైంలో మాధవ్ రాజకీయాలు వైపు వెళ్ళాడు. ఆ తిరుగుడికి, కార్యకర్తల మంచి చెడు చూస్కోవడానికి కష్టపడి సంపాదించిన సొమ్మంతా చేతికి ఎముక లేనట్టు దానం చేసేసాడు. కథ మొదటి కొచ్చింది. అప్పటికే ముగ్గురు పిల్లలు. పద్ధతి మార్చుకోమని చెప్పిచెప్పి ఓపిక సచ్చిపోయి పద్మావతి టీచర్ పిల్లల్ని తీస్కుని హైదరాబాద్ వచ్చేసింది. నెలకొచ్చే రెండువేల జీతంతో ఇల్లు ముగ్గురు పిల్లల బాధ్యతలు చూస్కోవాలి. ఇటు కన్నవారికి చేరువ కాలేదు, అటు చూస్తే మెట్టినింట శాశ్వత శత్రుత్వం మిగిలింది. నాలుగేళ్లు గడిచాయి. పిల్లలకి తండ్రి అవసరముంటుంది, పైగా వాళ్ళిద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రాణమని తెలిసాక అహం ఎన్నిరోజులడ్డొస్తుంది?

'ఇంటికి వస్తున్నాను' అని కబురు పంపింది. అంతా రెడీ అయ్యి చెప్పుల్లో కాళ్ళు పెట్టే టైంకి మాధవ్‌కి ఆక్సిడెంటయ్యి హాస్పిటల్లో అడ్మిట్ అయ్యాడని తెలిసింది. తను వెళ్లేసరికి అతను జీవం ఖాళీ చేసి వెళ్ళిపోయాడు. భుజాలు తట్టి ఒక్కసారి వెనక్కి రమ్మని గట్టిగా ఏడ్చింది. అతని చేయి నిర్జీవంగా ఆమె ఒడిలో పడింది. అప్పుడు కనపడింది అతని మోచేతి నుండి మణికట్టు వరకు 'పద్మావతి' అని పెద్దగా వేయించు కున్న పచ్చబొట్టు. నా ప్రేమ ఇంత పెద్దది అని చెప్పాలనుకున్నాడేమో. ఆ అవకాశం పూర్తిగా రాలేదు. మాధవ్‌తో కలిసి గడిపిన ఆ కొన్నేళ్లే ఆమెకి ఒంటరితనంలో మిగిలిన ఊసులు, ఊహలు.

బిడ్డ భారం దింపేసుకోవాలనుకునే తల్లిదండ్రులకి నచ్చజెప్పి, తెలిసీ తెలియని వయసులో పెళ్ళికి ఒప్పుకున్న పిల్లలకి కౌన్సిలింగ్ ఇచ్చి ఇలా చాలా పెళ్ళిళ్ళు ఆమె

అనుభవంతో ఆపగలిగింది. కౌముదికి కూడా అవే పాఠాలు నేర్పింది. ప్రేమించడం ఒక ఎత్తైతే, ఆ తర్వాత రాబోయే జీవితం మరో ఎత్తు, అన్ని రకాలుగా ఆలోచించి చెయ్యాలని చెప్పింది.

❉ ❉ ❉

పద్మావతి వెళ్ళిపోయాక 'లగ్గం ఎందుకు ఆపినవ్?' అని అడిగింది కౌముది.

'చిన్న పిల్లకి గిప్పుడే లగ్గమా? మా అక్కగిట్లనే మస్తు బాధ పడ్డది' అన్నాడు శివ.

'మంచి పని చేసినవ్'

సన్నగా నవ్వాడు.

'ఎత్తులంటే భయంలే నీకు?'

'ఎత్తులా?'

'హా. బోనాలనాడు పోల్ పైకెక్కి బ్యానర్లు కట్టినవ్గా'

'నువ్వు చూసినావా?'

'హా గప్పుడే చూసిన. ముందు ఉల్టా కట్టినవ్. లేట్ అయితందని మీ ఫ్రెండ్ మొత్తుకున్నా వినకుండా మల్ల పైకెక్కి సీదా చేసినవ్. నేను చూసినాలే. నియ్యత్ ఉన్నోడివే'

'అంటే?'

'అంటే తప్పు చేసినాక ఎవరూ సూడకుంటే పారిపోయే టైపు కాదు. తప్పని తెలిసి మల్లా పైకెక్కి మంచిగా సెట్ చేసినవ్'

'మనకి ఇచ్చిన పని గట్లనే చెయ్యాలె మరి. నువ్వు కూడా గదే చేసినవ్గా'

'నేనా?'

'మల్ల? గుడి ముంగిట ముగ్గు పెట్టలే? గప్పుడు. ఇక చాతనైతల్లే పా... పోదామని మీ అమ్మో ఎవరో పిల్చింద్రు. మొత్తం ముగ్గు పెట్టిపోవాలన్నవ్. నేను చూసిన పైకెక్కి బ్యానర్ కట్టినప్పుడు'

'నువ్వు గప్పుడే చూసినవా?'

'మల్ల? గప్పుడే ముగ్గులో దింపినవ్'

'ఏయ్'

'ఆ ఆ సారీ సారీ'

'చాయ్ తాగుదమా? నాకు మస్త్ ఇష్టం'

'నిమ్రాహ్ కాడ తాగుదమా? ఏక్దం ఉంటది'

‘పా మరి’

‘రా మరి’ అని బండి స్టార్ట్ చేసాడు.

ఆమె బైక్ ఎక్కినప్పుడు అతని ప్రేమ ప్రయాణానికి అదే నాంది అనుకున్నాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. అప్పుడప్పుడు నిమ్రాహ్ కేఫ్ దగ్గర నిలబడి చాయ్ తాగేవారు. ఆమెకి పౌనాచాయ్, బన్‌మస్కా. అతనికి అల్లం చాయ్, ఉస్మానియా. మూడు నెలలు గడిచిపోయాయ్. ఎదురుగా చార్మినార్ చారిత్రాత్మిక సౌధం సాక్షిగా ఒకరోజు అడిగేసాడు.

‘లగ్గం చేస్కుందామా? మస్తుసార్లు అడిగిన. ఏం చెప్తలేవ్. ఏదో ఒకటి చెప్పు’

‘నీకు నేనంటే ఎంతిష్టం?’

‘మస్త్ ఇష్టం’

‘అదే ఎందుకు? టీచర్ అని ఇష్టమైందా? పన్నెండు వరకు సదివినానని ఇష్టమైందా? సర్కారీ నౌక్రీ ఉందని ఇష్టమైందా? ఎందుకు?’

‘ఏయ్... ఏందిది? లవ్ అంటే సదువుకి పైసల్కి లింక్పెడతావేంది? నీ నౌకరీ, అది తెచ్చే పైసల్చూసి లవ్ చేయలే నీ దేర్చూసి చేసిన. మా అక్కంటే మస్తు ఇష్టం నాకు. అందరు పనికి పోతే నన్ను ఎత్తుకుని సాకింది. ఆమె జర్ర దేర్చేసుంటే ఆమె మొగుని చేతిలో బలి కాకుండే. నీలో దేర్చూసిన. అది ఇష్టం’

ఆమె మౌనంగా కూర్చుంది. గోల్కొండ కోట నుంచి ఛార్మినార్‌కు భూగర్భ సొరంగం ఉందా లేదా అనేది తేలనట్టు ఆమె మనసులో తను ఉన్నాడా లేడా అనేది తేలట్లేదు. చూసి చూసి నోరు విప్పింది.

‘దేర్గా లేకుంటే నన్ను బతకనియ్యరు. నువ్వంటే ఇష్టమే. నీకు నియ్యత్ ఉంది. లవ్ అంటే నీతో సినిమాలు, పార్కులకి గట్ల తిరగలేను. మా అమ్మని మంచిగ చూస్కోవాలె, ఆమెకి కష్టం లేకుండా ఉండాలె. అన్నీ సెట్చేసినాక చేస్కుందం’

‘నిజం? ఒట్టు?’

‘హా. కానీ ఇట్లకాదు?’

‘అంటే? ఏం కావాలె?‘

‘ఇజ్జత్’

‘ఇజ్జత్ ఏంది?’

‘నన్ను ఇజ్జత్‌తో తీస్కపో’

‘అంటే ఎట్ల?’

‘ఇంట్ల నుండి పారిపోయి అట్ల కాదు. ఇజ్జత్‌తో ఇంట్ల మాట్లాడి’

'ఇంట్ల మీ అమ్మ ఏమంటదో?'

'తిడతది. నేను తెచ్చిన నలభై ఏండ్ల పైసలున్నోడి కంటే వీడెట్ల నయమైండనంటది నీ గురించి'

'మరెట్ల?'

'అందుకే ఇజ్జత్ కావాలె. పైసల్ ఉండాలె. చుట్టూ మంది మనకి ఇజ్జత్ ఇయ్యాలె'

'అంటే? పైసలుంటేనే ఇజ్జతా? అది లేనోడి కాడ ఇజ్జత్ ఉండదా ఏంది? నియ్యత్ ఉండాలె దేనికైనా'

'గట్లకాదు. మనకాడ పైసల్ ఉండాలంటే లక్షలు కోట్లు కాదు. మనం బతకనీకి ఆడా ఈడా దేవులాడకుండా ఉండాలె. నాకు బన్‌మస్కా నచ్చింది. నీకు బిర్యానీ అనుకో. ఇంటికి పోయేటప్పుడు ఒక ఎక్స్‌ట్రా పార్సెల్ అనుకో. అప్పుడు జేబులు దేవులాడద్దు. నేను మన కుమ్మరి గల్లీలో కొన్న మట్టికుండ నీళ్లు తాగుతా. ఫ్రిడ్జ్ అడగను. అందులో ఏం పరేషానీ లేదు. పాణం బాలేకుంటే అప్పుగిట్ల తెచ్చి మందులు కొనుడుకాదు. దేవులాడద్దు. నేను కూడా కష్టం చేస్తా. మా అయ్య తాగితాగి బొంద పెట్టుకుండు. గిదే తాగుబోతు లక్ష్మణ్ ఇల్లు అనేటోళ్లు. నాకు జాబ్ వచ్చినాక అంగన్వాడీ టీచర్ ఇల్లు అంటుండ్రు. ఎవరి ముందు చెయ్యి చాపద్దు. అట్ల ఓ తాప మా అమ్మ చేస్తే ఎదిగిన బిడ్డకి, అంటే నాకు రేటు కట్టిండ్రు కొడుకులు. అట్ల కావద్దు. ఇజ్జత్ ఇయ్యాలె. పైసల్ లేవని సంతలో మాల్లెక్క ఎవరూ చూడద్దు.'

'గింతున్నావ్. ఎంత దునియా చూసినవే?'

'చూసిన. మా అయ్య పొయినాక మస్తు చుసిన. మా ఇంటి సేటు ఒక నెల కిరాయి లేటైతే నన్ను, మా అమ్మని తాపతాపకి ఆకలిగా చూస్తడు బద్మాష్‌గాడు. అట్ల ఎన్నో. మా పద్మావతి టీచర్ కాడ చాలా నేర్చుకున్న. ఆమె పెద్దబిడ్డకి నా అంతే వయసు. ఆమె నన్ను బిడ్డ లెక్కనే చూస్తది. మస్తుసార్లు చెప్పింది పెండ్లి గురించి చూసి ఆలోచన చెయ్యాలని. పైసల్లేక కొన్ని దినాలు ఆమె బిడ్డలకి కారం అన్నం పెట్టిందామె. ఆమె కష్టం, పరేషానీలు ఎవొర్కొద్దు. తిండి, బట్టలు, ఇల్లు గిట్ల అన్నీ ఇజ్జత్ తేవాలె. ఉండాలె. ఎంత ఉంటే అందులోనే మనం మంచిగుండాలె. నిన్ను మత్లబ్ చేస్తలేను. మనకొరకే చెప్పిన. బతకనీకి కావాల్సినవి లేవని మనం లొల్లి పెట్కోవద్దు కదా.'

మొదటిసారి ఆమెని చూసాడు. మనసుకి దగ్గరగా. సన్నగా, చామన ఛాయగా ఉంది. ఆమె కళ్ళల్లో లోతు. భావం చూద్దామంటే మనసుకి తప్ప చూపుకి అందట్లేదు. కను బొమల మధ్య లోకం చూసిన స్థితప్రజ్ఞత. షెడ్డులో ఒక మూలన పడున్న టూల్స్ డబ్బాలో ఎప్పుడో ఒకసారి కనిపించే ముప్పైమూడో నెంబర్రెంచిలా. దేవగన్నేరు పువ్వులా. ప్రపంచానికి పైపైకి తెల్లగా, గంభీరంగా కనిపిస్తుంది. దగ్గరగా పరీక్షగా చూస్తేనే

దానిలోనున్న పసుపు వర్ణంలోనికి వెళ్లి ఎక్కడా లేని పసితనం, అరుదైన అందం బయట పడుతుంది.

'టైం కావాలె' అన్నాడు కాస్త నిరుత్సాహంగా. ఆమె ఒప్పుకుంటే ఏదో ఒకటి చేసి పెళ్లి చేస్కోవచ్చనుకున్నాడు.

'మాయమ్మ చూసినోళ్లందరూ ఇదేమాట చెప్పింద్రులే.. ఇక రావు' అనుకుంది మనసులో.

వారం పదిరోజుల వరకు కలవలేదు. ఫోన్లో అట్లట్ల మెసేజిలు రాయబారాలు చేసాయ్. ఇంత పెద్ద బాధ్యత తనవల్ల అవుతుందా అని ఆలోచనలో పడ్డాడు శివ. డబ్బంటే ప్రయత్నిస్తే లక్షలు కాకపోయినా కాస్తోకూస్తో సంపాదిస్తాడు. ఆమె అడిగింది ఇజ్జత్. జీవితాంతం ఇవ్వాలి. ఇచ్చాక కాపాడుకోవాలి. గాలికి నడవదు. అడవిలో పెరిగే తంగేడులా ఆమె ఒక ఔషధ మొక్క. ఇంతమంది తోడేళ్ళ మధ్యన ఎలా బతికిందా అని ఒకటి రెండుసార్లు ఇంటి ఓనర్ మీద కోపం కూడా వచ్చింది. వద్దని చెప్పేద్దాం అనుకున్నాడు. ఇంత బాధ్యత తన వల్ల కాదనుకున్నాడు. చదువుకున్న పిల్లతో ఎందు కనుకున్నాడు.

అప్పుడే మళ్ళీ కనపడింది. బస్తీ నుండి పిల్లల్ని బడికి తీస్కెళ్తోంది. వెనక నుండి ఎవడో అరుస్తున్నాడు.

'నా బిడ్డలు నా ఇష్టం. ఇస్కూల్ బంద్ చెపిస్తా. నీకేమైతంది?'

'బంద్ చేసి ఏం చేస్తవ్? నీ లెక్క బిచ్చం ఎత్తాల్నా ఏంది? గిట్లనే ఉండాల్నా? మంచిగ అవద్దా ఏంది? మంచిగ అయ్యేది మన చేతిలో ఉంటది. అది లేకుంటే నీకు ఆ బర్రెకి ఫరక్ ఏంది? చల్' అని తిట్టుకుంటూ పిల్లల్ని తీస్కుని వెళ్ళిపోయింది.

శివ అక్కడే ఆగిపోయాడు. 'జిందగీ మంచిగ చేస్కోవాల్నని మస్త్ జోష్ ఉంది పోరికి. దిమాగ్గిట్ల ఆమె వైపే గుంజుతాంది' అనుకుంటూ సాయంత్రం నిమ్రాహ్‌కి రమ్మని ఫోన్ చేసాడు.

'ఏంది రమ్మంటివి?'

'అదే మన లవ్ గురించి. నాకు జర టైం పడ్తది సెటిల్ కానీకి' అన్నాడు తల గోక్కుంటూ.

'వాపస్ రావనుకున్న.'

'అట్లెట్ల అనుకుంటవ్? జర అన్నీ సూస్కోవలె కదా'

'గట్లే కానీయ్. ఏం చేస్తవ్' అంది పానా తాగుతూ.

'ఏమో. అన్న లెక్క నేను కూడా ఔట్ ఆఫ్ పోతా. గప్పుడే జల్దీ అయితది. నేను లేకుంటే నువ్వు వానితో వీనితో గిట్ల పోవు కదా?'

'అరేయ్ బాడ్కవ్. ఎట్ల కానొస్తున్న నీకు? నాది చిన్న జిందగీ. నీలెక్కుండదు.

సినిమాలు, ఫ్రెండ్స్, మస్తీ గివేమీ ఉండవ్. ఇయ్యాల్టి వరకు మొత్తం కష్టమే ఉండే...' అంది నీళ్లు నిండిన కళ్ళతో.

'గట్లైతే నీ చిన్న జిందగీని నా పేద్ద ప్రపంచంలో కలిపేస్తలే. మస్తుంటది' అని భుజం మీద చెయ్యేసి దగ్గరకి లాక్కున్నాడు.

రెండ్రోజుల తర్వాత విషయం తన అన్నకి చెప్పాడు శివ.

'లైన్లో పడ్డావ్‌లే. ఏదో ఒకటి చూస్తలే. పొద్దుగాల బార్కస్ షేక్ కాడికిపో. ఏమైనా ఉంటే చెప్తడు' అన్నాడు అన్న.

మనిషి మనస్ఫూర్తిగా చెయ్యాలనుకుంటే అవకాశాలు వాటంతట అవే కలిసొస్తాయేమో. నెలరోజులకి దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫాకి క్లీనింగ్ స్టాఫ్ కావాలని షేక్ ఫోన్ చేసాడు.

'తేరేకో ఆదత్ హైనా? ఊపర్ చడ్ సక్తానా తూ?' అన్నాడు బుర్జ్ అసలు ఎత్తు చెప్పకుండా.

ఏర్పాట్లన్నీ చేస్కుని చివరిగా ఒకసారి కౌముదితో నిమ్రాహ్ దగ్గర చాయ్ తాగి సెల్ఫీ తీస్కున్నాడు.

ఆమె ఎయిర్పోర్ట్ వరకు వచ్చింది.

'గింత దూరం ఎందుకొచ్చినవ్? వాపస్ ఎట్ల పోతవ్ ఒక్కదానివే?' అన్నాడు.

'దోస్త్ ఉందిలే. ఇది ఇజ్జత్ స్టార్టింగ్. బస్తీ నుండి ఎయిర్పోర్ట్‌కి ఒచ్చిన. అంటే ఇజ్జత్ షురూ'

'నువ్వు నవ్వింది సూడలే నేను' అన్నాడు ఆమె కళ్ళోల్లోకి చూస్తూ.

'వస్తదిలే, నువ్వు తెస్తవులే' అంది కంట్లో నీళ్లు ఆపుకుంటూ గట్టిగా అతని చెయ్యి పట్టుకుని.

ఆ పసితనం అతన్ని లాగేసింది. వెనక్కి వెళ్ళిపోవాలనే అంత లాగేసింది. ఆమె తనతో ఉండాలనే ఆశ ముందుకు నడిపింది. అతను లగేజీ తీస్కుని లోపలికి వెళ్లాడు.

చీకట్లో ఏదో చిన్న ఆశ దొరికిందని సంతోషించేలోపు అది వచ్చి 'నాకు కాస్త పనుంది, మళ్ళొస్తా' అంటే మనిషికి ఎలా ఉంటుందో అలా ఉంది ఇద్దరికి లోపల.

* * *

దుబాయ్ వెళ్ళాక బుర్జ్ చూసి అదురుకున్నాడు. కొన్నాళ్ళు ట్రైనింగ్ ఇచ్చారు. మొదట ఒకటి రెండు ఫ్లోర్స్ క్లీన్ చేయించారు ప్రాక్టీసు కోసం. అనుభవం వచ్చేకొద్దీ ఎక్కే హైటు పెరిగింది. ఎక్కేకొద్దీ రోజుకో ఆఫీసు కనపడేది. ఒక్కోరోజు ఒక్కో ఆఫీస్ వ్యూ. అమ్మోరి గుడికాడ ఎక్కిన పోల్ హైటు దాటిపోయాడు. ఒక్కోసారి శుక్రవారం అమ్మోరుకి కట్టిన

ఎర్రచీర గుర్తొచ్చేది. వెంటనే అంత ఎత్తులో ఆమెకి మనసులో మొక్కేవాడు. అమెకిచ్చే హారతి కర్పూరం వాసన ఆ గాలిలో వెతుక్కునేవాడు. అప్పుడు కౌముది ఎదురుగా అద్దంలో కదలాడేది. ఓ రోజు కిటికీ దగ్గరున్న డెస్క్ దగ్గర ఒక తెల్లామె కూర్చుంది. క్లీన్ చేస్తూ బ్లేడ్‌తో నురగ పక్కకి లాగాడు. సినిమాలో హీరోయిన్ రివీల్ అయినట్టు నురగ చాటు నుండి బయటకి వస్తూ ఆమె ఎదురుగా కనపడింది. ఆమె అతని వంక చూసి చిన్నగా నవ్వి కళ్ళతో కృతజ్ఞత చెప్పింది. ఇజ్జత్ కనిపించింది అందులో అతనికి. మొహమాటంగా కళ్ళు కిందకి దించాడు. ఆమె స్టాకింగ్స్ కనపడ్డాయి. కుడివైపు స్టాకింగ్‌కి చిన్న చిల్లుపడింది. కౌముది బుగ్గసొట్ట కనపడింది అందులో. అక్కడ మీటింగులో ఎవరో బోర్డు మీద మార్కర్‌తో రాస్తుంటే ఆమె క్లాసురూమ్ గుర్తొచ్చేది. ఏ పిల్లగాన్ని స్కేల్ పెట్టి కొడుతుందో అనుకునేవాడు. ఒక్కోసారి అద్దాల మీద వర్షపు చుక్కలు వదిలిన ఆనవాలు ఉండేవి. అచ్చం కౌముది పైపెదం మీదున్న పుట్టుమచ్చలా. తుడవాల నిపిచ్చేది కాదు.

చూస్తూ చూస్తూ సంవత్సరం గడిచిపోయింది.

'నేను ఇంటికి పోతా, నువ్వొ ఒక తాపరా' అన్నాడు శివ అన్న.

అనుకున్న రెండ్రోజులకే కోవిడ్ నిబంధనలు వచ్చి పడ్డాయి. అన్న అక్కడ, శివ దుబాయ్‌లో ఆగిపోయారు.

మళ్ళీ బోనాల పండగొచ్చింది. ఈసారి జాతర వెలవెలబోయింది.

'అంతా మంచిగైతది. బతుకమ్మ కలిసి చేస్కుందంలే' అంది కౌముది గొంతులో ఏడుపు మింగేస్తూ. ప్రేమ అని దగ్గరకొచ్చిన నెలకే బాధ్యత అని దూరం వెళ్ళిపోయాడు మరి. శివకి ధైర్యం ఇవ్వడానికి అందో లేక నిజంగానే అందో తెలీదుకానీ సరిగ్గా దసరా పండక్కే శివకి లీవ్ దొరికింది.

❊ ❊ ❊

పండుగ మరో పదిరోజుల్లో ఉందనగా 'అయ్యిందే క్లీనింగ్. ఇయ్యాల కిందికి దిగినం అందరం. వస్తున్న మీ ఇంట్ల మాట్లాడనీకి. వచ్చే ఐతారం ఈటైంకి నీ ముంగటుంట.'

'జల్దీ వచ్చేయ్. చార్మినార్ లైట్ల కాడ సెల్ఫీ దింపుకుందాం.'

'నువ్వు ఖుష్ ఉన్నావా?'

'ఖుష్ కాకుండ ఎట్లుంట? ఎంత చేసినవ్ నా కోసం? నీకు చెప్పలేకాని నాకు ఈడ పాణం పొయ్యేది నువ్వు క్లీనింగ్కి పైకెక్కుతుంటే' అంది ఏడుస్తూ.

❊ ❊ ❊

ప్రయాణం రోజు ఎయిర్పోర్ట్‌కి బయల్దేరాడు శివ. సిగ్నల్ దగ్గర టాక్సీ ఆగింది. ఎదురుగా బుర్జ్. లేజర్ షో మొదలైంది. ఈ రెండు సంవత్సరాలలో టూరిస్టుల కోసం

ఎప్పుడూ వేసే రెగ్యులర్ షో. షారుఖ్ ఖాన్ పుట్టినరోజుకి అతని బొమ్మ, స్వాతంత్ర్య దినోత్సవానికి, కోవిడ్–19 కేసులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో భారతదేశానికి సంఘీభావంగా త్రివర్ణపతాకం. ఇవి వెలగటం చూసాడు బుర్జ్ మీద. ఇవ్వాళ వేరు. బుర్జ్ మీద 'బతుకమ్మ' లేజర్ షో మొదలైంది. బతుకమ్మ నూట అరవై మూడు అంతస్తు లెక్కింది. టాక్సీ అద్దం దించాడు. ఎడారి పూలతో తంగేడు పూలు జతకట్టాయి. 'అల్లిపూల వెన్నెల... చెరువులోన కురువగా' పాట ప్రతిధ్వనుల మధ్య ఇసుక మీద నిలబడ్డ వేల అద్దాలు మెరుస్తున్నాయి. ఆ అద్దాల మీద తనప్రేమ కూడా.

శివ కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

'ఇజ్జత్కావాలె, ఇజ్జత్కావాలె' అని తనని ఒక కొత్త ప్రపంచంలోకి నెట్టి ఇజ్జత్ ఇప్పించింది తన ప్రేమ.

అదే రాత్రి 'ఏడంతస్తుల మేడ ఉయ్యాలో... ఎక్కరాదు దిగరాదు ఉయ్యాలో' అని కౌముది అక్కడ బస్తీలో బతుకమ్మ ఆడుతోంది.

బుర్జ్ ఖలీఫా అద్దాల మీద మెరుపు దుబాయ్ దాటి, హైదరాబాద్ పాతబస్తీ గల్లీల్లోకి మళ్లి, తన ఇంటి ముంగిట రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మ చుట్టూ చప్పట్లు కొడుతూ వలయాకారంగా తిరుగుతున్న ఆమె మొహం మీదకి పాకి బుగ్గన సొట్టగా మారింది.

కౌముది నవ్వింది.

– తెలుగు పెద్ద కథలు 2022